క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: మండలంలోని మర్రిమిట్ట విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనుల కారణంగా నేడు గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ప్రణీత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో లైన్ పరిధిలోని లైన్‌తండా, మర్రిమట్టి, బందాలగడ్డతండా, తోటద్రుతండా గ్రామాలతోపాటు అయోధ్యపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని రాజనపల్లి, మధనాపురం గ్రామాల పరిధిలోని లైన్‌లలో కూడా మరమ్మతు పనులు ఉన్నాయని, ఆ గ్రామాలకు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం కల్గుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

'తప్పుడు ఆరోపణలు తగదు'



బయ్యారం: మాస్‌లైన్ జిల్లా నాయకుడు జగ్గన్నపై కొందరు తప్పుడు ఆరోపణలు చేయటం తగదని పార్టీ మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం అన్నారు. బుధవారం బయ్యారంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జగ్గన్నను మావోయిస్టు, ఇసుక మాఫియా అని కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సత్యం, యాకయ్య, పూర్ణ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కాంగ్రెస్‌ను ఆదరించారు

డోర్నకల్: పార్లమెంటు ఎన్నికల్లో మహిళలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ తెలిపారు. బుధవారం డోర్నకల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డోర్నకల్‌లో 75శాతంగా పైగా ఓటింగ్ నమోదు కాగా మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఓటింగ్ సరళిని పరిశీలించగా కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌కు భారీగా ఓటేసినట్లు అర్థమవుతుందని, మహిళలు కాంగ్రెస్‌కు భారీ సంఖ్యలో ఓటేశారని తెలిపారు.

పేదలకు బియ్యం, పండ్ల పంపిణీ

కేసముద్రం: మండల కేంద్రంలో కేసముద్రంస్టేషన్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రమా–నాగేశ్వర్‌రావు దంపతుల పెళ్లిరోజు సందర్భంగా బుధవారం పీడీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరుపేదలకు పండ్లను పంపిణీ చేశారు. అదేవిధంగా బ్రహ్మంగారితండా, బడితండాల్లో రెండు నిరుపేద కుటుంబాలకు యూత్ కాంగ్రెస్ నాయకులు 50కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు బనిషెట్టి వెంకటేష్, విజయ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు అల్లం గణేష్, నవాజ్‌అహ్మద్, కమల్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నర్సంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ ప్రశ్నాపత్రం ఆవిష్కరించారు. పరీక్షలు సమర్థవంతంగా, కట్టుదిట్టంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఐ.శివనాగ శ్రీను, సహాయక నియంత్రణ అధికారులు రమేష్, త్యాగయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ నరేందర్ పాల్గొన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం..

- ముందు జాగ్రత్తలతో నివారణ
- నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం



నెహ్రూసెంటర్: డెంగీ జ్వరం పేరు వింటేనే ప్రజల్లో వణుకు మొదలవుతుంది. ఆడ ఏడీస్ ఈజిప్టి దోమ వలన వచ్చే డెంగీ జ్వరం భారీన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నా.. జిల్లాలో అక్కడక్కడ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే దోమల వ్యాప్తి నిర్మూలించడంతోపాటు డెంగీను అరికట్టవచ్చని వైద్యులు తెలుపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ప్రారంభంలోనే 13 కేసులు నమోదు అయ్యాయి. మరో నెల రోజుల్లో జ్వరాల కాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పిస్తూ విషపూరిత జ్వరాల భారీన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా వైద్యాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రతి ఏడాది మే 16న జాతీయ డెంగీ నివారణ అవగాహన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తేనే...

ఇంటి ఆవరణలో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలి. ప్రతి మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలి. దోమలు నివాసం ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా డెంగీ వ్యాధికి గురికాకుండా ఉంటారని వైద్యులు తెలుపుతున్నారు.

లక్షణాలు

డెంగీ జ్వరంగా అనుమానం వచ్చిన రోగికి పూర్తిస్థాయిలో రక్తపరీక్షలు నిర్వహించాలి. దీంలో తెల్లరక్తకణాలు తగ్గడం, ప్లేట్‌లెట్స్ కణాల సంఖ్య తగ్గడం, ఎర్రరక్తకణాల సంఖ్య పెరగడం జరుగుతుంది. ఎలీసా పరీక్షతో కచ్చితంగా వ్యాధిని నిర్ధారించిన తరువాత పూర్తి స్థాయిలో వైద్యం తీసుకోవాలి. డెంగీ జ్వరం వచ్చిన వారిలో తీవ్రమైన తలనొప్పి, జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అవగాహన సదస్సులు చేపడుతున్నాం..



వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు డెంగీ జ్వరాల భారీన పడకుండా జాగ్రత్తలు తెలుపుతూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అవగాహన పెంచుకోవడం ద్వారా వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– డాక్టర్ సుధీర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్

తాగునీటి ఎద్దడిని తీర్చాలి



తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలతో మాట్లాడుతున్న సక్రు

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీ మంగలితండా ఎస్టీ కాలనీ, దేశ్యాతండాలో తాగునీటి ఎద్దడిని తీర్చాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు సంబంధిత జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం తాగునీటి ఎద్దడి గ్రామాలను ఆయన సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీరు గ్రామస్తులకు సరిపడ రాకపోవడంతో, రక్షిత మంచినీటి పథకం బావుల ద్వారా గ్రామ పంచాయతీ సిబ్బంది తాగునీటి సరఫరా చేస్తున్నారు. వారం రోజులుగా రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ తాగునీరు నామమాత్రంగా సరఫరా చేస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ తాగునీరు గ్రామస్తులకు సరిపడా అందేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇట్టి విషయంపై ఎంపీఓ రజినిని 'సాక్షి' వివరణ కోరగా రక్షిత మంచినీటి పథకం మోటారు స్టార్టర్ మరమ్మతుకు గురైందని, స్టాటర్‌కు వెంటనే మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

తాగు నీటి కష్టాలు

మరిపెడ రూరల్: మండలంలోని చింతలగడ్డతండా జీపీ మాజీ సర్పంచ్ గుగులోతు పాకనాయక్‌కు నీటి కష్టాలు మొదలయ్యాయి. సర్పంచ్ పదవీలో ఉన్నంత కాలం గ్రామంలో నీటి సరఫరాకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. పదవీ కాలం పూర్తయిన తర్వాత ఇన్‌చార్జ్ అధికారుల పాలన రావడంతో నీటి కష్టాలు వచ్చాయి. ఇటీవల తండాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతో పాకనాయక్ సుదూర ప్రాంతంలోని వ్యవసాయ బావి నుంచి బకెట్లతో నీటిని తోడి తెచ్చుకున్నాడు.

పంచలోహ కిరీటం బహూకరణ



దాతను సన్మానిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ ట్రస్ట్ బాధ్యులు

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని గోపాలపురం కాలనీలో గల పెద్దమ్మ తల్లికి పంచలోహ కిరీటాన్ని ఎన్ఆర్ఐ విద్యార్థి గుండెల వినయ్బాబు బుధవారం బహూకరించారు. ఈసందర్భంగా పెద్దమ్మ తల్లి దేవాలయ ట్రస్ట్ కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, సలహాదారుడు సింగని అశోక్ మాట్లాడుతూ.. ట్రస్ట్ చైర్మన్ గుండెల రాజు, రేణుక దంపతుల పెద్దకుమారుడు, ఎన్ఆర్ఐ గుండెల వినయ్ బాబు పెద్దమ్మ తల్లికి పంచలోహ కిరీటం బహూకరించారన్నారు. రూ.26 వేల విలువైన పంచలోహ కిరీటాన్ని అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి అమర్చారు. దాతను ఆలయ ట్రస్ట్, నడిగడ్డ, హన్మంతునిగడ్డ ముదిరాజు పెద్దలు ఘనంగా అభినందించి, సన్మానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గుండెల రాజు, ఉపాధ్యక్షుడు కొండ సారయ్య, కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్, కోశాధికారి భూముల వెంకన్న, సలహాదారులు సింగని అశోక్, అల్వాల వెంకన్న, హన్మంతునిగడ్డ, నడిగడ్డ ముదిరాజు సంఘం అధ్యక్షులు నాగరాజు, కొప్పు ఉప్పలయ్య, కార్యదర్శులు బాలకృష్ణ, మల్లేష్, కోశాధికారులు శ్రీనివాస్, భూం నర్సయ్య, పుచ్చ వెంకటయ్య, ట్రస్ట్ డైరెక్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు సేవ చేయడంలోనే ఆనందం



అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న యుగేందర్

దంతాలపల్లి: వృద్ధులకు సేవచేయడంలోనే సంతోషం ఉందని ఎన్ఎస్‌యూఐ తొర్రూరు మండల అధ్యక్షుడు, భారత యాదవ సంఘం మండల అధ్యక్షుడు వల్లపు యుగేందర్ అన్నారు. బుధవారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని పెద్దముప్పారం గ్రామంలోని అమ్మఒడి వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు, పెళ్లిరోజులను పురస్కరించుకొని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఎంతో కొంత సహాయం చేయాలని కోరారు. ఇకపై తమ ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలు జరిగిన అనాథ వృద్ధులకు తమకు తోచిన విధంగా సహాయం అందిస్తాం అన్నారు. కార్యక్రమంలో తొర్రూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హైమద్ బాషా, ప్రతినిధులు కిషన్‌రెడ్డి, మురళీ, రహీం, మున్నా, మణి, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సంకీసలో మెగా వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్ల సంకీస గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలోని జీసస్ ఎల్‌షద్దై చర్చి ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు ఖరీదైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. పెరుమాళ్ల సంకీసతో పాటు సమీప గ్రామాలకు చెందిన సుమారు 600 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జనరల్ ఫిజియన్ వైద్యులు సంధ్య, జితేందర్, ప్రమోద్, మోనాగ్ని, అప్తాల్మిక్ సంపత్, బిషప్ తిమోతి, చర్చి ఫాదర్ జీపీ కమల్ పాల్గొన్నారు.

ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

బయ్యారం: ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యూనేషన్‌లో కోత విధించటంపై ప్రశ్నించిన ఉద్యోగులపై నారాయణఖేడ్ ఆర్డీఓ లాఠీచార్జి జరిపించటం తగదని, అతనిపై చర్య తీసుకోవాలని టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌నాయక్ అన్నారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లాఠీచార్జికి కారణమైన అధికారులు, పోలీసులపై విచారణ జరిపి చట్టపరంగా చర్య తీసుకోవాలన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన మండలంలోని పీన్యా తండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సందీప్ ట్రాక్టర్‌ను నడుపుకుంటూ మండలంలోని పీన్యాతండాకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయాడు. ట్రాక్టర్ రోడ్డు పక్కనే ఉన్న కెనాల్ కాల్వలో బోల్తాపడింది. దీంతో సందీప్‌కు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గీత కార్మికుడికి..

పెద్దవంగర: ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన గీతకార్మికుడు గుర్రం యాదగిరి వృత్తిలో భాగంగా తాటి చెట్లు ఎక్కి కల్లు తీసుకొని తిరిగి తన సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ ఢీకొట్టింది. కాలు విరిగి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఘన నివాళి



గార్ల: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య దశదిన కర్మకు గార్ల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై పుల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వాజీచౌహాన్, జితేందర్ అగర్వాల్, కోట ఉత్తరయ్య, ఆడెపు వెంకటేశ్వర్లు, కడియం వెంకన్న, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఓటుకు దూరంగా ఉన్నారు..'

బయ్యారం: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ఓ రాజకీయ పార్టీ చేసిన ఎత్తుగడను కొందరు ఓటర్లు తమకు అవకాశంగా మార్చుకున్నారు. ప్రధాన పార్టీల తరపున బరిలో ఉన్న అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఇరుపార్టీలకు చెందిన వారు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో శాసనసభ ఎన్నికల అనుభవంను దృష్టిలో పెట్టుకొని ఓ పార్టీ బూత్‌ల వారీగా ఓటుకు నోటు ఇచ్చేందుకు తమ శ్రేణులను సిద్ధం చేసినట్టు సమాచారం. దీంతో ఒక్కొక్క బూత్‌లో ఉన్న ఓటర్ల మొత్తంలో 80శాతం మేర ఓటర్లకు ఓటుకు రూ.200 నుంచి రూ.250 పంచినట్టు ప్రచారం జరుగుతోంది. ఓటు కోసం డబ్బులతో ఇంటి వద్దకు వచ్చిన నాయకుల నుంచి డబ్బులు తీసుకున్న ఓటర్లలో కొందరు ఓటు వేసేందుకు పోలింగ్‌బూత్‌కు రాకపోవటం నాయకులను విస్మయానికి గురి చేస్తుంది. బూత్‌ల వారీగా పంచిన డబ్బుల ప్రకారం పోలింగ్ నమోదు కాకపోవటంతో ఆయా బూత్‌ల ఇన్‌చార్జ్‌లు నాయకత్వానికి ఏమని సమాధానం చెప్పాలో తెలియని స్థితిలో ఉన్నట్టు సమాచారం.

రాజ్యాంగ రక్షణకు నిరంతర పోరాటం



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సుజాత, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: బీఎస్పీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీఎస్పీ ఎంపీ అభ్యర్థి కోనేటి సుజాత అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులకు ధీటుగా మానుకోట లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించామన్నారు. ఎన్నికలకు సహకరించిన బీఎస్పీ నాయకులకు, మహిళలకు, యువతకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం బీఎస్పీ నిరంతరం దోహదం చేస్తుందన్నారు. ఈ అవకాశం కల్పించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్, విజయకాంత్, ప్రసాద్‌రావు, ముఖేష్, ఉపేందర్, రాజశేఖర్ వర్మ, కృష్ణవేణి, చాణిక్య, నాగన్న, శ్రీను, నరేష్, నాగరాజు, రేవంత్‌నాయక్, సాగర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి



మృతిచెందిన పాడి గేదెలు

గార్ల: విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన గార్ల పెద్దచెరువు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గార్ల మండలం పూమ్యాతండాకు చెందిన పఠాన్ ఖాజామియాకు చెందిన గేదెలను ఉదయం మేతకు వదిలాడు. గేదెలు మేత మేసుకుంటూ గార్ల పెద్దచెరువు సమీపంలోకి వెళ్లాయి. అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. గేదెలు ఇంటికి రాలేదని రైతు సాయంత్రం వెతుకుతుండగా గార్ల పెద్దచెరువు సమీపంలోని ట్రాన్స్‌ఫారం వద్ద మృతి చెంది ఉన్నాయి. గత ఏడాది సైతం ఈ ట్రాన్స్‌ఫారం దగ్గర ఇదే గ్రామానికి చెందిన పలువురు రైతుల గేదెలు, ఆవులు మృతిచెందాయని, ట్రాన్స్‌ఫారం ఎత్తు గద్దెపై నిర్మించాలని పలుమార్లు రైతులు విద్యుత్ అధికారులకు విన్నవించిన వారు పట్టించుకోలేదన్నారు. మృతిచెందిన గేదెల విలువ సుమారు రూ.1,20,000 ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన గేదెలకు నష్టపరిహారం చెల్లించాలని రైతు వేడుకున్నాడు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై

కురవి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ వ్యక్తికి, తిరిగి ఫోన్‌ను బుధవారం కురవి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి గ్రామానికి చెందిన విద్యుత్‌శాఖ లైన్‌మన్ వెంకటేష్ కొద్దిరోజుల క్రితం బైక్‌పై వెళ్తుండగా, జేబులో నుంచి సెల్‌ఫోన్ జారిపడింది. దీంతో అతడు కురవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సెల్‌ఫోన్ ఆచూకీని పోలీసులు కనిపెట్టి వెంకటేష్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. సహకరించిన కానిస్టేబుల్ నరేష్‌ను ఎస్సై అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకొని బాధితులకు అప్పగిస్తామన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 14న వెలువడిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో మహర్షి విద్యాలయం విద్యార్థులు ప్రభజనం సృష్టించారని మహర్షి విద్యాలయం కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా మహర్షి విద్యాలయం విద్యార్థులు సీబీఎస్ఈ పదోవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారని, ఉపాధ్యాయుల కృషి ఫలితమే ఈ ఫలితాలు వచ్చాయన్నారు. 500 మార్కుల గాను 481 డి.రవికిషోర్ మార్కులు సాధించారని, 90 శాతానికిపై 11మంది విద్యార్థులు, 60శాతం పైగా 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యకుమారి, ఉపాధ్యాయులు, విదార్థులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

నర్సంపేట: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మండలంలోని మచ్చాపురం గ్రామంలోని ప్రగతి హైస్కూల్ యాజమాన్యం నర్సంపేట డివిజన్‌లోని వివిధ మండలాలు, గ్రామాల్లో హైస్కూల్ ఐఐటీ మెడికల్ ఫౌండేషన్(సీబీఎస్ఈ) పేర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమాల ప్రకారం వరంగల్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలు, స్కూళ్ల పేర్ల ముందు టెక్నో, మెడికల్ ఐఐటీ ఈ టెక్నో, సీబీఎస్ఈ పేర్లతో ప్రచారం నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా.. విద్యాశాఖ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.

పెరిగిన మహిళా ఓటింగ్

- డోర్నకల్ 75.39 శాతం నమోదు
- మహబూబాబాద్‌లో 71.24శాతం
- రెండు నియోజకవర్గాల్లో మొత్తం 73.16శాతం ఓటింగ్

	మండలం	ఓటర్లు	ఓటు వేసినవారు	పోలింగ్ శాతం
డోర్నకల్ నియోజకవర్గం	చిన్నగూడూరు	13,073	9,756	74.62
	దంతాలపల్లి	24,987	17,691	70.80
	డోర్నకల్	39,137	30,657	78.33
	కురవి	41,498	30,981	74.65
	మరిపెడ	59,387	45,094	75.93
	నర్సింహులపేట	24,000	17,785	74.10
	సీరోలు	20,824	16,089	77.26
	మొత్తం	2,22,906	1,68,053	75.39
మహబూబాబాద్ నియోజకవర్గం	గూడూరు	47,646	34,396	72.19
	ఇనుగుర్తి	17,464	12,673	72.56
	కేసముద్రం	49,441	36,785	74.40
	మానుకోట	1,04,506	70,796	67.74
	నెల్లికుదురు	37,911	28,273	74.57
	దంతాలపల్లి	1,882	1,487	79.01
	మొత్తం	2,58,850	1,84,410	71.24

మహబూబాబాద్: మానుకోట జిల్లాలో పూర్తి స్థాయిలో మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసిన విషయం విధితమే. కాగా జిల్లా పరంగా రెండు నియోజకవర్గాలలో మండలాల వారీగా ఓటింగ్‌ను పరిశీలిస్తే.. డోర్నకల్ నియోజకవర్గంలోని డోర్నకల్ మండలంలో అతి ఎక్కువ పోలింగ్ శాతం నమోదు కాగా, మానుకోట నియోజకవర్గంలోని మానుకోట మండలంలో అతి తక్కువ ఓటింగ్ శాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండు నియోజకవర్గాల పరంగా పరిశీలిస్తే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

మొత్తం 73.16శాతం..

రెండు నియోజకవర్గాలకు గాను మొత్తం ఓటర్లు 4,81,756 ఉండగా 3,52,463 ఓటు వేయగా 73.16 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు తెలిపారు. దంతాలపల్లి మండలంలో కేవలం రెండు పోలింగ్ కేంద్రాలు మాత్రమే మానుకోట నియోజకవర్గంలో ఉండగా, పూర్తిస్థాయిలో మండలం డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో ఉంది.

ఇండియా కూటమి అభ్యర్థి గెలుపు ఖాయం



కేసముద్రం: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ వామపక్షాల మద్దతుతో, ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. బుధవారం మండలంలోని అమీనాపురంలో పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య వాదులకు, మతోన్మాదవాదులకు మధ్య జరిగిన ఎన్నికల సమరభేరి అన్నారు. కమ్యూనిస్టులకు, వామపక్ష వాదులకు నిలయమైన మానుకోట జిల్లాలో మతోన్మాద వాదులకు చోటులేదని మరోసారి ప్రజలు నిరూపించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి దాసరి లింగస్వామి, గంగాధర్ పాల్గొన్నారు.